# వ్యాజ్యాల ప్రకరణం

## 1వ అధ్యాయం - ప్రతివాది ప్రమాణం తప్పనిసరి

1113. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం:- ఒక ఇంట్లో లేక గదిలో ఇద్దరు స్త్రీలు మేజోళ్ళు తయారు చేసే పని చేస్తుండేవారు. ఒకరోజు వారిద్దరిలో ఒక స్త్రీ చేతిలో మేజోళ్ళు కుట్టే సువ్వ (పెద్ద సూది) దిగబడింది. ఆ స్థితిలో ఆమె బయటికి వచ్చి, తన చేతిలో దిగబడిన ఈ సువ్వను ఆ రెండవ స్త్రీ గుచ్చిందని చెప్పింది. ఈ వ్యవహారం హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) దగ్గరికి వచ్చింది. ఆయన దైవప్రవక్త (సల్లం) ప్రవచనాన్ని తెలియజేస్తూ "కేవలం ప్రజల ఫిర్యాదులను ప్రాతిపదికగా తీసుకొని వారికి అనుకూలంగా తీర్పునిస్తే అనేకమంది ప్రజల ధన ప్రాణాలకు నష్టం వాటిల్లుతుంది" అని అన్నారు. ఆ తరువాత ఆయన ప్రజలను సంబోధిస్తూ "ఈ స్త్రీకి దేవుడ్ని గుర్తు చేయండి. (అంటే ఆమెలో దైవభీతి కలిగించండి), ఆమెకు ఈ దైవసూక్తి పఠించి విన్పించండి- ఎవరు దేవునితో చేసిన ప్రమాణాలను అతి స్వల్ప మూల్యానికి అమ్ముకుంటారో (అంటే ఉల్లంఘిస్తారో) వారికి పరలోకంలో ఎలాంటి భాగం (పుణ్యఫలం) లభించదు. ప్రళయదినాన అలాంటి వారితో దేవుడు మాట్లాడడు; వారివైపు కన్నెత్తి కూడా చూడడు; వారిని పరిశుద్ధపరచడు. అంతేకాదు, వారి కోసం ఘోరమైన శిక్ష కాచుకొని ఉంటుంది (3:77)" అని అన్నారు.

ఆయన చెప్పినట్లే ప్రజలు ఆ స్త్రీకి హితోపదేశం చేశారు. దాంతో ఆమె (భయపడిపోయి తానే తన చేతిలో సువ్వ గుచ్చుకున్నానని) తన నేరాన్ని ఒప్పుకుంది.

ఆ తరువాత హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) దైవప్రవక్త ప్రవచనం ఒక దాన్ని ఇలా పేర్కొన్నారు: "ప్రతివాది తప్పనిసరిగా ప్రమాణం చేయవలసి ఉంటుంది"★.

**(సహీహ్ బుఖారీ:- 65వ ప్రకరణం- తఫ్సీర్, 3వ సూరా- ఆలి ఇమ్రాన్- ఇన్నల్లజీన యష్తరూన్ బి అహ్ దిల్లాహి వ అయిమానిహిమ్ సమనన్ ఖలీలా)**

---

★ మరో ఉల్లేఖనంలో రుజువు చేసే, సాక్ష్యం చూపే బాధ్యత వాదిపై ఉంటుందని ఉంది. ఒక వేళ వాది (తనకు జరిగిన అన్యాయానికి) రుజువు లేక సాక్ష్యం చూపలేని పక్షంలో అప్పుడు ప్రతివాది చేత (అన్యాయం చేయలేదని) ప్రమాణం చేయించవలసి ఉంటుంది. అతను ప్రమాణం చేస్తే తీర్పు అతనికి అనుకూలంగా ఇవ్వబడుతుంది. ఒకవేళ అతను ప్రమాణం చేయడానికి నిరాకరిస్తే వ్యాజ్యం రుజువయినట్లే (అంటే అతనే నేరస్థుడిగా రుజువవుతాడన్న మాట). ఈ హదీసు వ్యవహారాల్లో ఓ ముఖ్యమైన న్యాయ సూత్రాన్ని అందజేస్తోంది. ఇస్లామీయ షరీఅత్ ప్రకారం ఇచ్చే తీర్పులన్నీ ఈ హదీసు మీదే ఆధారపడి ఉంటాయి. పోతే ప్రతివాది చేత ఎలాంటి పరిస్థితిలో ప్రమాణం చేయించాలి అనే విషయంలో ఫిఖ్కావేత్తల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. ఇమాం షాఫయి (రహ్మలై) , అధిక సంఖ్యాక ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం వాది, ప్రతివాదుల మధ్య ఎలాంటి సంబంధం ఉన్నా లేకపోయినా, ఎలాంటి వ్యాజ్యంలోనయినా సరే వాది సాక్ష్యం చూపలేని పక్షంలో ప్రతివాది చేత తప్పకుండా ప్రమాణం చేయించాలి. ఇమాం మాలిక్ (రహ్మలై), మదీనా ఫిఖ్కావేత్తల అభిప్రాయం ప్రకారం వాది, ప్రతివాదుల మధ్య (పూర్వం నుంచి ) ఏదైనా వ్యాపారాది సంబంధాలు ఉండి ఉంటేనే ప్రతివాది చేత ప్రమాణం చేయించాలి. లేకుంటే ప్రతి నీచుడూ మంచివాడిపై వ్యాజ్యం వేసి, బలవంతంగా అతని చేత ప్రమాణం చేయిస్తూ అతడ్ని వేధించే ప్రమాదం ఉంటుంది. కాని ఈ అభిప్రాయానికి హదీసులో, ధర్మవేత్తల ఏకాభిప్రాయం (ఇజ్మా) లో ఎలాంటి ఆధారం లేదు. (ఇమామ్ నవవీ - రహ్మలై).

## 3వ అధ్యాయం- బాహ్య పరిస్థితుల ఆధారంగా తీర్పు

1114. హజ్రత్ ఉమ్మె సల్మా (రజి) కథనం:- దైవప్రవక్త (సల్లం) ఓ రోజు తమ ఇంటి సమీపంలో ఎవరో పోట్లాడుకోవడం విని బయటికి వచ్చారు. ఆయన (వారిని ఉద్దేశించి) ఇలా అన్నారు: "గుర్తుంచుకోండి! నేను కూడా మానవమాత్రుడ్నే. అందువల్ల నా దగ్గరికి ఏదైనా వ్యవహారం తీర్పు కోసం వస్తే, ఒక వర్గం తన ప్రత్యర్థి వర్గం కన్నా ఎక్కువ వాక్చాతుర్యం కలవాడై ఉంటే అతని మాటలు విని నేను అతను నిజమే చెబుతున్నాడని భావించి అతనికి అనుకూలంగా తీర్పు ఇచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ఎప్పుడైనా ఇలా జరిగితే, (అంటే) ఉభయవర్గాల్లో ఒకతని పక్షాన ధర్మం ఉన్నప్పటికీ నేను రెండవ వ్యక్తికి అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగితే గుర్తుంచుకోండి - నా తీర్పు వల్ల లభించిన (ఐహిక) ప్రయోజనం (పరలోకంలో) అగ్నికణంగా పరిణమిస్తుంది. ఇక ఇష్టమయిన వారు ఈ నరకాగ్నిని తీసుకోవచ్చు; లేదా ఈ నరకాగ్నిని వదలి దీనికి దూరంగా ఉండవచ్చు.★

**(సహీహ్ బుఖారీ:- 46వ ప్రకరణం- ముజాలిమ్, 16వ అధ్యాయం- ఇస్ము మన్ ఖాసమఫీబాతిలిన్ వహువ యాలముహు)**

## 4వ అధ్యాయం- (అబూ సుఫ్యాన్ భార్య) హిందా జగడం గురించిన తీర్పు

1115. హజ్రత్ ఆయిషా (రజి) కథనం:- హిందా బిన్తె ఉత్బా (రజి) ఓసారి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఇలా అన్నది: "దైవప్రవక్తా! (నా భర్త) అబూ సుఫ్యాన్ పిసినారి మనిషి. నా పోషణకు, నా పిల్లల పోషణకు సరిపడినంత కూడా డబ్బు ఇవ్వడు. అందుచేత నేనతనికి తెలియకుండా అతని డబ్బు నుండి కొంత తీసుకొని ఎలాగో సంసారం నెట్టుకొస్తున్నాను" దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి విని "నీవతని సంపద నుండి నీ పోషణకు, నీ పిల్లల పోషణకు సరిపడినంత డబ్బు ధర్మయుక్తంగా తీసుకోవచ్చు. (అంతకంటే మించి తీసుకోవడం ధర్మసమ్మతం కాదు)" అని అన్నారు.

**(సహీహ్ బుఖారీ:- 69వ ప్రకరణం-నఫఖాత్, 9వ అధ్యాయం- ఇజాలమ్ యున్ఫిఖిర్రజులు ఫలిల్ మర్ అతి అన్తఖుజ బిగైరి ఇల్మిహీ మా యక్ఫీహ్ వ వలదహా బిల్ మారూఫ్)**

1116. హజ్రత్ ఆయిషా (రజి) కథనం:- (అబూ సుఫ్యాన్ భార్య) హిందా బిన్తె ఉత్బా (రజి) ఒక రోజు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి ఇలా అన్నది: "దైవ ప్రవక్తా! (ఒకప్పుడు) యావత్తు ప్రపంచంలో ఏ

---

★ ఈ హదీసుని బట్టి న్యాయాధిపతి ఇచ్చిన తీర్పు వల్ల వాస్తవం మారదని అసత్యం సత్యం కాజాలదని, హలాల్ హరామ్‌గా, హరామ్ హలాల్‌గా మారదని అధిక సంఖ్యాక ధర్మవేత్తలు నిర్ణయానికి వచ్చారు. ఇమామ్ షాఫయి (రహ్మాలై) , ఇమామ్ మాలిక్ (రహ్మాలై) , ఇమామ్ అహ్మద్ (రహ్మాలై)ల అభిప్రాయం కూడా ఇదే. కాని ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) అభిప్రాయం ప్రకారం న్యాయాధికారి తీర్పుతో ఉపస్థ ధర్మసమ్మతమవుతుంది; సొమ్ము ధర్మ సమ్మతం కాజాలదు. అంటే, ఒక వ్యక్తి ఫలానా స్త్రీతో తన వివాహమయిందని న్యాయస్థానంలో వ్యాజ్యం వేసి, అందుకు సాక్ష్యం కూడా చూపిస్తే లేదా ప్రతివాది ( ఆ స్త్రీ) ప్రమాణం చేయడానికి నిరాకరిస్తే, దాని ఆధారంగా న్యాయాధికారి ఆ వ్యక్తికి అనుకూలంగా తీర్పిస్తే నిజానికి వారిద్దరి వివాహం కాకపోయినా ఆ స్త్రీ అతని ధర్మపత్నిగా పరిగణించబడుతుందన్న మాట. ఆమెతో అతను సంభోగించడం ధర్మ సమ్మతమవుతుందన్న మాట! ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారి ఈ అభిప్రాయం హేతువు రీత్యా సమంజసమయినప్పటికీ హదీసు బాహ్యభావానికి, అనేక మంది ధర్మవేత్తల అభిప్రాయానికి వ్యతిరేకంగా ఉంది. దీనికి భిన్నంగా న్యాయాధికారి గనక సాక్ష్యాలు, ఆధారాలతో లేదా ప్రతివాది ప్రమాణం చేయని కారణంగా ఒకరి ఆస్తిని వాస్తవ పరిస్థితికి విరుద్ధంగా మరొకరి ఆస్తిగా పరిగణిస్తూ తీర్పు ఇస్తే, వాదికి ఇహలోకంలో గాకపోయినా పరలోకంలో మాత్రం తప్పకుండా శిక్ష పడుతుంది. ఈ తీర్పు తప్పయిపోతే, ఆస్తి అసలు యజమానిదే అవుతుంది. ప్రతివాది దౌర్జన్యపరుడిగా, దురాక్రమణదారుడిగా పరిగణించబడతాడు.

